

గుర్లలోని పీహెచ్‌సీ వద్ద వివరాలు తెలుసుకుంటున్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి విజయానంద్

క్షేత్రస్థాయికి వెళ్లండి.. లోపాలను సరిచేయండి

గుర్ల ఘటనపై ప్రత్యేక కార్యదర్శి వ్యాఖ్యలు

ఈనాడు– విజయనగరం, న్యూస్‌టుడే, గుర్ల, విజయనగరం అర్బన్: గుర్ల ఘటనపై ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కె.విజయానంద్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విచారణాధికారిగా నియమితులైన ఆయన మంగళవారం జిల్లాలో పర్యటించారు. ముందుగా విజయనగరంలో అన్నిశాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఇంత పెద్ద వైద్య వ్యవస్థ ఉండి.. మందులు, వసతులు కొరత లేకున్నా వ్యాధిని అరికట్టలేకపోయామన్నారు. అన్ని విభాగాల వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, లోపాలను సరిచేసుకోవాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, వైద్యారోగ్యశాఖల వారు చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. తాగునీరు కలుషితం కావడానికి గల కారణాలు, పారిశుద్ధ్య పనులు, వైద్య సాయం తదితర అంశాలను తెలుసుకున్నారు. మృతుల్లో కిడ్నీ, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు కూడా ఉన్నారని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు.

పైపులైన్లు మార్చండి..

గుర్ల పీహెచ్‌సీలో బాధితులను పరామర్శించారు. అనంతరం పలు వీధుల్లో తిరిగారు. తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉండడం సరికాదన్నారు. వాటిని తొలగించాలని ఆదేశించారు. పరిసర ప్రాంతాల్లో కొత్త కేసులపై ఆరా తీశారు. కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డివిజినల్ పంచాయతీ అధికారి మోహనరావు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గాల్లోనే గోపురం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వద్ద గాలి గోపురం నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఇది ఒకటి. భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఏటా శివరాత్రి తరువాత వచ్చే ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతరకు 5 లక్షలకు పైగా తరలివస్తుంటారు. ఆదాయం సైతం పుష్కలంగా ఉంటుంది. పట్టణ శివారున విశాల ప్రాంగణంలో దేవస్థానం అభివృద్ధి చెందింది. ప్రవేశ ద్వారం వద్ద గాలిగోపురాన్ని నిర్మించాల్సి ఉంది.

ప్రతిపాదనలకే పరిమితం..

ఈ నిర్మాణానికి దాదాపు రూ.50 లక్షల ఖర్చవుతుందని అంచనా వేశారు. దేవాదాయశాఖ సీజీఎఫ్ కింద నిధులు మంజూరు చేయాలి. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈమేరకు ప్రతిపాదనలు పంపారు. అయితే అప్పటికే గర్భగుడి నిర్మాణానికి నిధులు రావడంతో.. ఈ ప్రతిపాదన అలాగే ఉండిపోయింది. వైకాపా అధికారంలోకి వచ్చాక కనీసం కదలిక లేకుండా పోయింది. 'గాలి గోపురాన్ని దర్శిస్తే శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామ'ని ఈవో శ్రీనివాస్ తెలిపారు.



తల్లి దర్శనానికి బారులుదీరిన భక్తులు

హంస వాహనంపై ఇలవేల్పు వైభవం

కనులపండువగా పైడితల్లి తెప్పోత్సవం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం మంగళవారం సాయంత్రం కనులపండువగా సాగింది. ఆలయ సహాయ కమిషనర్ డీవీవీ.ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తల్లి సేవకుల నేతృత్వంలో పెద్ద చెరువు పశ్చిమ భాగాన వైభవంగా జరిగింది. మధ్యాహ్నం వేదసభ, అమ్మవారికి స్నపన, క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక అలంకరణతో కూడిన పల్లకిలో ప్రతిష్ఠించి, వేదపండితులు, అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ ఊరేగింపుగా గాడీఖానాకు తీసుకొచ్చారు. 5.30 గంటలకు రాజహంస ఆకారంలోని తెప్పపై తల్లి కొలువుదీరింది. దేవస్థానం సిబ్బంది, వేదపండితులు, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో మూడుసార్లు తెప్పను చెరువు చుట్టూ తిప్పారు. ఈ సందర్భంగా దర్శనాలకు భక్తులు బారులుదీరారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గస్తీ నిర్వహించారు. రాత్రి వనంగుడిలో మెట్లోత్సవం చేపట్టారు.



ఉత్సవ విగ్రహానికి పసుపుతో అభిషేకం చేస్తున్న నిత్య సేవకులు, దీక్షాధారులు



పెద్ద చెరువులో హంస వాహనంపై విహరిస్తున్న అమ్మవారు

బాణసంచా విక్రయాలపై నిఘా

గజపతినగరం, న్యూస్‌టుడే: దీపావళి నేపథ్యంలో బాణసంచా అక్రమ తయారీ, నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. అక్రమ తయారీపై గత నెల రోజుల్లో 30 కేసులు నమోదు చేశామని, రూ.4 లక్షల సామగ్రి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గజపతినగరం పోలీసు స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రమణ, ఎస్సైలు లక్ష్మణరావు, మహేష్, రాజేష్, జయంతి తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఆశల సౌధం.. అల్లంత దూరం

ఉమ్మడి విజయనగరం జిల్లాకు మంజూరైన కురుపాం గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరానికి(2025-26) అందుబాటులోకి తెచ్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ఉన్నత విద్యామండలి దీనిపై నివేదిక కోరినట్లు జేఎన్‌టీయూ అధికారులు ధ్రువీకరించారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో రెండు నెలలుగా గుత్తేదారులు పనులు ఆపేశారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో కదలిక రానుందని భావిస్తున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం, కురుపాం గ్రామీణం



కురుపాంలో మధ్యలోనే ఆగిపోయిన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు

నిధుల ఖర్చుల తీరిదీ.. (రూ.కోట్లలో)	
నిర్మాణ వ్యయం:	153.853
ఇప్పటి వరకు ఖర్చు:	43.53
జేఎన్‌టీయూ మంజూరు చేసింది:	23.00
రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది:	4.53
పెండింగ్‌లో ఉన్న బిల్లులు:	16.00

కురుపాం మండలం టేకరఖండి ప్రాంతంలో 105 ఎకరాల్లో కళాశాల నిర్మాణానికి 2020 అక్టోబరు రెండో తేదీన ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టేందుకు రూ.153.853 కోట్లతో ప్రణాళిక రూపొందించారు. తొలుత నిధులు విడుదల చేయకపోవడంతో జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం విడతల వారీగా మంజూరు చేసింది. దీంతో కొంతమేర జరిగాయి. అనంతరం ప్రతిపాదన మేరకు 2023-24 బడ్జెట్‌లో రూ.32.99 కోట్లు ఇస్తామని వైకాపా ప్రకటించినా విడుదల చేయలేదు. ఈక్రమంలో నాలుగేళ్లుగా ప్రవేశాలకు నోచుకోలేదు.

గత ప్రభుత్వంలో..

■ కళాశాల తొలుత జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండేది. 2022 జనవరిలో నగరంలోని గురజాడ విద్యాలయం పరిధిలోకి వచ్చింది. ఒక కోర్సుకు 60 సీట్ల చొప్పున సివిల్, మెకానికల్, సీఎస్ఈ, ఇఇఇ, ఈసీఈ కోర్సుల్లో 300 సీట్లకు 2022లో ఆమోదం లభించింది.

■ బోధన 80, బోధనేతర పోస్టులు ఆరు మంజూరయ్యాయి. పొరుగుసేవల కింద 48 ఉద్యోగాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీటిలో తొమ్మిది బోధన పోస్టులను హేతుబద్ధీకరణలో భాగంగా విజయనగరం విశ్వవిద్యాలయానికి బదలాయించారు.

■ గిరిజన విద్యార్థులకు ప్రత్యేక కోటా ఇచ్చే ప్రతిపాదనను స్థానికులు తెరపైకి తీసుకొచ్చినా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

అకడమిక్ బ్లాక్ 70 శాతం పూర్తయింది. రెండు అంతస్తుల వరకు వసతిగృహాల నిర్మాణాలు జరిగాయి. ఇంకో రెండు అంతస్తుల మేర పనులు చేపట్టాలి. ఫ్లోరింగ్, విద్యుత్తు, రోడ్లు, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించాల్సి ఉందని ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈఈ రామకృష్ణ తెలిపారు. సోమవారమే నివేదికను పంపించినట్లు ఇన్‌ఛార్జి ఉప కులపతి డి.రాజ్యలక్ష్మి చెప్పారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి, పనులు పూర్తిచేయిస్తామని కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి చెప్పారు.

రాత్రయితేనే బయటకొస్తారు.. తవ్వి తరలించేస్తారు

బొబ్బిలి పరిసర ప్రాంతాల్లో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొంతమంది రాత్రి వేళల్లో ఈ తతంగాన్ని గుట్టుగా కానిచ్చేస్తున్నారు.



జగనన్న కాలనీలకు వెళ్లే దారిలో కరిగిపోతున్న కంకర గుట్ట

ప్రభుత్వం తాజాగా ఉచిత ఇసుక ఇస్తామని ప్రకటించింది. ఈక్రమంలో ఇళ్ల నిర్మాణాలకు కాకుండా పరిశ్రమలకు తీసుకెళ్లిపోతున్నారు. వేగావతి నది నుంచి పెద్దఎత్తున ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లతో తరలించేస్తున్నారు. నదీ తీరంలో కనిపిస్తున్న భారీ గుంతలే ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఇక మట్టి తవ్వకాలకు లెక్కేలేదు. ప్రత్యేక నిఘా ఉంచామని, అనుమతులు లేకపోతే చర్యలు తప్పవని తహసీల్దారు ఎం.శ్రీను హెచ్చరించారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక



ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర విద్యుత్తు

ఈనాడు, విశాఖపట్నం: సౌర విద్యుత్తు వినియోగానికి ముందుకు వచ్చేవారికి పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిస్తున్నాయి. మూడు కిలోవాట్లకు రూ.78 వేల వరకు ఆర్థిక సాయం చేస్తున్నాయి. అయితే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగానే అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిస్కంల వారీగా వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది.



వందశాతం రాయితీతో సోలార్ పరికరాలు

ఇద్దరికీ లాభమే..

◆ ఈ కనెక్షన్ల వల్ల లబ్ధిదారులతో పాటు ప్రభుత్వానికీ ప్రయోజనమే. సౌర పలకలపై పెట్టుబడితో యంత్రాంగంపై మొదట కొంత ఆర్థిక భారం పడినా దీర్ఘకాలంలో విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు భారీగా తగ్గనుంది.

◆ ఇప్పటికే ఎస్సీ, ఎస్టీల్లో 200 యూనిట్ల లోపు వినియోగించేవారికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ఒక్కో యూనిట్‌పై సుమారు రూ.6 వరకు వెచ్చిస్తోంది. అదే సోలార్ ద్వారా అందించగలిగితే ఆ సొమ్ము ఆదా అయినట్లే. ఈ లబ్ధిదారులు చాలా మంది 100 నుంచి 150 యూనిట్ల మధ్యనే వినియోగిస్తుంటారు. ఒక కిలోవాట్ సోలార్ ఉపకరణాలతో నెలకు 120 యూనిట్లు సౌరశక్తి ద్వారా అందుబాటులోకి వస్తుంది. మిగతా 20 నుంచి 30 యూనిట్ల భారమే ప్రభుత్వంపై పడుతుంది.

◆ 'ఇళ్లలో వినియోగించే విద్యుత్తు కంటే సోలార్ ద్వారా ఎక్కువ ఉత్పత్తి జరిగితే ఆ మిగులును డిస్కంకు తిరిగి అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. ఒకసారి పలకలు ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా వినియోగించవచ్చు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గుర్తింపు సర్వే పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాచరణ ఉంటుంది' అని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

కనెక్షన్ల సంఖ్య ఇలా..		
ఉమ్మడి సర్కిల్	ఎస్సీ	ఎస్టీ
విజయనగరం	57,601	45,252

దళారులు ఇచ్చిందే ధర

దోపిడీకి గురవుతున్న పత్తి రైతు

కానరాని కొనుగోలు కేంద్రాలు

– న్యూస్‌టుడే, బొబ్బిలి, రామభద్రపురం

పత్తి రైతులు దగాకు గురవుతున్నారు. పంట కోత దశకు వచ్చింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో చేతికి అందడంతో అన్నదాతలు నిల్వ చేసుకోలేక ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఇంకా తెరవకపోవడంతో దళారులు రంగ ప్రవేశం చేసి నచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఈక్రమంలో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి.



ప్రైవేటు కాటాల వద్ద తూకం

క్వింటాకు రూ.800 నష్టం..

ప్రైవేటు ట్రేడర్లు క్వింటాను రూ.6,700కు కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వం రూ.7521లు ప్రకటించింది. అంటే క్వింటాకు రూ.800 పైచిలుకు నష్టపోతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. మరోవైపు తూకంలో కూడా తేడా చూపిస్తున్నారు. దీంతో క్వింటాకు రూ.5 కిలోల వరకు అదనంగా ఇచ్చేస్తున్నారు.

పరిస్థితి ఇదీ..

ఉమ్మడి జిల్లాలో 1370 హెక్టార్లలో పత్తి సాగవుతోంది. హెక్టారుకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఏటా 11 వేల క్వింటాళ్ల వరకు చేతికి అందుతోంది. ఈనెలలో మొదటి దశ కోత ప్రారంభమైంది. రామభద్రపురం, మక్కువ, సాలూరు, తెర్లాం, బాడంగి, దత్తిరాజేరు, మెరకముడిదాం మండలాల్లో ఎక్కువగా చేతికొచ్చింది. తొలి దశలో 4 వేల క్వింటాళ్ల వరకు అమ్మకానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే చాలామంది రైతులు సేకరించి ఇళ్లల్లో నిల్వ చేశారు. ఈక్రమంలో వర్షాల కారణంగా పాడవుతుందన్న ఉద్దేశంతో ప్రైవేటు ట్రేడర్లకు విక్రయిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..

దీపావళి పండగ ముందుగా ఉండడంతో ఇళ్లల్లో నిల్వ చేసుకోవడం ఇబ్బంది. అందుకే ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నాం. ప్రభుత్వం రామభద్రపురంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇంత వరకు పెట్టలేదు.

- ఎం.తిరుపతి, వై.మురళి, రామభద్రపురం, రైతులు

రెండు కేంద్రాలు ఎక్కడ..

ప్రభుత్వ రాజాం, రామభద్రపురంలో కేంద్రాలు తెరుస్తామని ప్రకటించింది. కానీ ఇంతవరకు ఏర్పాటు కాలేదు. త్వరలోనే అందుబాటులోకి తెస్తామని మార్కెటింగ్‌శాఖ ఏడీ రవికిరణ్ తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) సహకారంతో కేంద్రాలు నడుస్తాయన్నారు. మద్దతు ధరకు అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ జేడీ రామారావు చెప్పారు.



పాలకొండలోని కాపువీధి కూడలిలో ప్రధాన లైను దుస్థితి



బెలగాంలోని ఎస్సీ వీధిలో కాలువలోనే తాగునీటి పైపులు

జలం కాదు.. గరళం 6లో



ఇటీవల వచ్చిన వరదలకు సంతకవిటి మండలం రెల్లిగెడ్డపై కోతకు గురైన రోడ్డు

గుంతల దారి.. గుండెలు జారి 6లో

తీరంలో అప్రమత్తత

పూసపాటిరేగ,: రానున్న మూడు రోజుల్లో తుపాను ప్రభావం ఉన్నందున తీర ప్రాంతాల్లో మత్స్యకారులను అప్రమత్తం చేయాలని ప్రత్యేకాధికారిణి సుధారాణి తెలిపారు. మంగళవారం భోగాపురంలోని తహసీల్దారు కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. గర్భిణులను పీహెచ్‌సీలకు తరలించి, వైద్య సేవలు అందించాలని చెప్పారు.

బొడ్డవర రోడ్డుకు రూ.956.21 కోట్లు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పెందుర్తి నుంచి బొడ్డవర వరకు నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధికి రూ.956.21 కోట్లు మంజూరు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిందని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. దీంతో విశాఖ, ఎస్.కోట మధ్య రాకపోకలు సులువవుతాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

శ్వాసకోశ రోగులకు మెరుగైన వైద్యం

'న్యూస్‌టుడే'తో ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు

ముఖాముఖి

– న్యూస్‌టుడే, విజయనగరం వైద్యవిభాగం

ఊపిరితిత్తుల సమస్యలతో ఇబ్బంది పడేవారు గతంలో ప్రైవేటు ఆసుపత్రులకు, లేకుంటే పొరుగు జిల్లాలకు వెళ్లేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలోని విజయనగరం మహారాజా ప్రభుత్వ వైద్యాలయంలో రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ఇటీవలే ఈ విభాగానికి సంబంధించిన నిపుణులు అందుబాటులోకి రావడంతో మరింత మెరుగయ్యాయి. మరోవైపు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ కింద సైతం చికిత్సలు అందిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణ మార్పులతో ఎక్కువ మంది ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు **డా.బి.సంతోష్‌కుమార్** తెలిపారు. 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పలు విషయాలను వెల్లడించారు.

వారికి ప్రత్యేక చికిత్సలు..

ఆస్తమా, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా చికిత్సలు అందిస్తున్నాం. ఇన్ హేలర్ పరికరాన్ని ఉచితంగా ఇస్తున్నాం. క్షయ నిర్ధారణ పరీక్షలు సైతం చేస్తున్నాం. వ్యాధి ఏ భాగానికి సోకిందో తెలుసుకుని ఆ మేరకు వైద్యం చేస్తున్నాం. ఊపిరితిత్తుల్లో కఫం పేరుకుపోవడం, చీము పట్టడం, నీరు చేరడం.. తదితర కేసులు ఎక్కువగా బయటపడుతున్నాయి. స్టైరోమెట్రి యంత్రం ద్వారా నిర్ధారించుకుని, ముందుకెళ్తున్నాం.



పొగతాగితే తీవ్ర ముప్పు..

ప్రస్తుతం అన్ని దేశాల్లో లంగ్ క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారు. ఊపిరితిత్తుల్లో అనియంత్రణ కణాల పెరుగుదల వల్ల వస్తోంది. పొగ తాగిన వారిలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆ అలవాటు లేకున్నా.. పక్కన నిల్చున్న వారికి కూడా సోకే ప్రమాదం ఉంది. ఉమ్మడి జిల్లాలో అడ్డపొగ కాల్చే వారు ఇప్పటికీ ఉన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కట్టెల పొయ్యిపై వంటలు చేస్తున్నారు. అలాంటి మహిళలు ఆసుపత్రులకు వస్తున్నారు. వాయు కాలుష్యం వల్ల కూడా వ్యాధి సోకుతోంది. నెలకు 12 నుంచి 15 వరకు ఇలాంటి కేసులు బయటపడుతున్నాయి.

రెండేళ్లుగా నిర్ధారణ పరీక్షలు..

ప్రభుత్వ వైద్య కళాశాల రావడం వల్ల మహారాజా ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండేళ్లుగా వ్యాధి నిర్ధారణకు సంబంధించిన పరీక్షలు ముమ్మరంగా జరుగుతున్నాయి. తీవ్రమైతే విశాఖపట్నంలో ఉన్న పలు క్యాన్సర్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నాం. ఈ రెండేళ్లలో అన్ని రకాల క్యాన్సర్లకు సంబంధించి ఇప్పటివరకు రెండు జిల్లాల్లో 475 కేసులు నమోదయ్యాయి.

ముందుగానే పరీక్షలు..

విపరీతమైన దగ్గు, నోటి నుంచి రక్తం రావడం, బరువు తగ్గడం, అలసట, నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, స్వరంలో మార్పు తదితర లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. ప్రారంభ దశలో గుర్తిస్తే మందుల ద్వారా జీవన ప్రమాణాన్ని పెంచుకోవచ్చు. ధూమపానానికి దూరంగా ఉండటం, సమస్యను గుర్తించడానికి ముందుగానే పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. మహారాజా ఆసుపత్రిలో గుర్తించే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. సద్వినియోగం చేసుకోవాలి.

కారణాలివీ..

మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. క్రమశిక్షణ లేని నడవడిక, తినే ఆహారం మీద అదుపు లేకపోవడం, నిద్ర దూరమవడం, వ్యాయామం చేయకపోవడం, పని ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, తీవ్ర భావోద్వేగాలు, ఖైనీ, గుట్కా, మద్యం తదితరాలకు బానిసలు కావడంతో ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయి.

గుంతల దారి.. గుండెలు జారి


అధ్వానంగా సంతకవిటి- పొందూరు ఆర్అండ్‌బీ రహదారి



గుంతలమయంగా మామిడిపల్లి- మండవకురిటి మార్గం


రాజాం నియోజకవర్గ పరిధిలోని పలు మార్గాలు అధ్వానంగా దర్శనమి స్తున్నాయి. సంతకవిటి, రాజాం, రేగిడి, వంగర మండలాల్లో కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్లు విస్త రించి ఉన్నాయి. ఏళ్ల నాటివి కావడం, మరమ్మతులు లేకపో వడంతో ఎక్కడికక్కడే గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహన దారులు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో బాగుచేసేందుకు అధికారులు కనీసం చర్యలు చేపట్టలేదు. ఈక్రమంలో వర్షాలు, వరదల కారణంగా మరింత దెబ్బతిన్నాయి. తాత్కాలికంగానైనా బాగు చేయాలని చోదకులు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఈఈ జేమ్స్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. జిల్లాలో పాడైన దారుల మరమ్మతులకు రూ.6 కోట్ల నిధులు వచ్చా యని, టెండర్లు పిలిచి పనులు చేపడతామని చెప్పారు.

– న్యూస్‌టుడే, సంతకవిటి


సంతకవిటి- రాజాం దారి ఇలా..


ప్రమాదకరంగా కృష్ణంవలస- కొండగూడేం రోడ్డు






వంటకు తీసుకెళ్తున్న వెదురు కర్రలు..

బతుకు చిత్రాలు.. కళారూపాలు

పార్వతీపురంలోని కలెక్టర్ కార్యాలయం కొత్త రూపు సంతరించుకుంటోంది. మన్యం ప్రజల జీవన విధానాన్ని తెలిపే చిత్రాలు, ఆదివాసీ సంస్కృతికి అద్దం పట్టే కళారూపాలు కలెక్ట రేట్ గోడలపై రూపుదిద్దుకుంటున్నాయి. పూర్వీకుల పూజలు, కుటుంబాల ఐక మత్యం, దాంపత్య జీవితం, పోడు వ్యవ సాయం, పంటలను ఇళ్లకు తీసుకురావడం లాంటి తదితరాలు కళ్లకు కట్టినట్లుగా చిత్రాలను గీశారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు కలెక్ట రేట్ సిబ్బంది తెలిపారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం కలెక్టరేట్ ప్రాంగణం


కందికొత్తుల పండగలో


జీలుగు కల్లు కోసం..


సామలు దంచే పడుచులు..



జలం కాదు.. గరళం

కలుషిత నీరు తాగడం, నిల్వఉన్న ఆహారం తీసుకోవడం, అపరి శుభ్ర పరిసరాలు, ఆహారంపై ఈగలు వాలడం.. తదితర కారణాలతో ఉమ్మడి జిల్లాలో అతిసారం విజృంభిస్తోంది. ఇప్పటికే ఎస్.కోట, పాచిపెంట, గుర్ల, దత్తిరాజేరు తదితర ప్రాంతల్లో బాధితులు మంచం పట్టారు. అయినప్పటికీ కొన్నిచోట్ల అధికారులు ఇంకా అప్రమత్తం కాలేదు. గ్రామాల్లో అధ్వాన పారిశుద్ధ్యమే దీనికి నిదర్శనం. మరో వైపు తాగునీటి పైపులైన్లు ఎక్కువగా మురుగు కాలువల్లో నుంచి వెళుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సాలూరు గ్రామీణం, పాలకొండ


పార్వతీపురం వరహాలు గెడ్డలో ప్రధాన పైపులైను

జిల్లాలోని పురపాలక సంఘాల్లో కుళాయిల ద్వారా తరచూ కలుషిత నీరు వస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. పార్వ తీపురం పురపాలక సంఘం 24 వార్డుల్లో పురుగులున్న నీరు రావడం గతంలో తీవ్ర ఆందోళన కలిగించింది. స్థానికంగా చర్చ నీయాంశమైంది. బైపాసు రోడ్డు, ఇతర కాలనీల్లోనూ అదే పరి స్థితి. సాలూరు, పాలకొండ పురపాలక సంఘాల్లోనూ వ్యర్థజ లాలు వస్తున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అందుకు ప్రధాన కారణం పలుచోట్ల పైపు లైన్లు మురుగు కాలువల్లోంచి వెళ్లడమే. మరికొన్ని ప్రాంతాల్లో భూమిలోపల పైపులకు లీకులు ఏర్పడడంతో మట్టి, మురుగు చేరుతోందనే ఆరోపణలు న్నాయి. ఈ మూడు పట్టణాల్లో 23 శాతం పైపులు కాలువల్లోనే దర్శనమిస్తున్నాయి.

పార్వతీపురంలో ఇలా..

పార్వతీపురం పురపాలక సంఘంలో 6,800 వరకు కుళాయిలున్నాయి. వీటి పైపులైన్లు చాలావరకు కాలువల గుండా వెళుతున్నాయి. వైకేఎం కాలనీ, బెలగాం ఎస్సీ వీధి, గెడ్డవీధి శివారు నుంచి ఎస్సీ కాలనీ, గంటా వీధి, కృష్ణ పల్లి, నెయ్యిల వీధి, షిరిడీ సాయి మందిరం తది తర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది.


సాలూరు పట్టణంలోని తెలగవీధిలో అపరిశుభ్రంగా నీళ్లట్యాంకు

సాలూరులో..

సాలూరు పురపాలక సంఘం పరిధిలో 29 వార్డుల్లో 3,137 కుళాయి కనెక్షన్లు న్నాయి. రోజూ ఉదయం గంటపాటు మాత్రమే నీరు అందిస్తున్నారు. అయితే చాలా వరకు పైపులే కాకుండా కుళాయిలు సైతం కాలువల్లో ఉన్నాయి. కొన్నిచోట్ల వాటిల్లోకి దిగి నీళ్లు పట్టుకోవాల్సిన పరిస్థితి. లావేటివీధి, చిట్లివీధి, తెలగవీధి తదితర ప్రాంతాల్లో ఇబ్బందులున్నాయి.

నగర పంచాయతీ పరిధిలో..

పాలకొండ నగరపంచాయతీ పరిధిలోనూ పలుచోట్ల ఏళ్లుగా మురుగు కాలువల గుండానే వెళుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటు కుళాయిలకు సంబంధించిన పైపులైన్లను డ్రైనేజీల గుండా మళ్లించారు. వరదల సమయంలో లీకులు ఏర్పడుతుండడంతో కలుషిత జలాలు వారికి దిక్కవుతు న్నాయి. కాపువీధులు, వెంకంపేట, భారతమ్మవారివీధి, ముదు నూరువారివీధి, గటాలడెప్పివీధి, కస్పావీధి, తంతితపాలా రహదారి, శెగిడివీధి తదితర చోట్ల ఈ దుస్థితి నెలకొంది.

అధికారులు ఏమన్నారంటే..

కుళాయిల ద్వారా శుద్ధజలాన్ని అందిస్తున్నామని, లీకులను సకాలంలో అరికడుతున్నామని సంబంధిత అధికారులు సన్యా సిరావు, సత్యనారాయణ, కిరణ్‌కుమార్ తెలిపారు. పరిశీలించి, పైపులైన్లు కాలువల్లో లేకుండా చూస్తామని చెప్పారు.


పాలకొండ కస్పావీధిలో మురుగు కాలువ పక్కనే రక్షిత కుళాయి

అదనపు పరిహారానికి అవకాశం


అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఆర్డీవో కీర్తి

కొత్తవలస, న్యూస్‌టుడే: విశాఖపట్నం- రాయపూర్ జాతీయ హరిత రహదారిలో ఉత్త రాపల్లి వద్ద ప్రతిపాదించిన అంతర మార్పు నకు గుర్తించిన భూములపై క్లెయిమ్‌లు దాఖలు చేయాలని ఆర్డీవో కీర్తి కోరారు. మంగ ళవారం తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో చర్చించారు. 35 ఎకరాలు సేకరించాల్సి ఉందని, పరిహారం ప్రక టించి ఏడాదిన్నర కావస్తున్నా ప్రక్రియ ఇంకా అపరి ష్కృతంగానే ఉందని గుర్తు చేశారు. ల్యాండ్ కన్వ ర్షన్ అయిన భూములకు సెంటుకు రూ.3.50 లక్షలు నిర్ణయించారని, వ్యవసాయ భూములకు సెంటుకు రూ.35వేలు పరిహారం ఇస్తున్నారని, ఇది ఎంతవ రకు న్యాయమని రైతులు అన్నారు. నిర్ణయించిన పరిహారం ప్రకారం క్లెయిమ్‌లు సమర్పిస్తే.. అద నంగా 30 శాతం వరకు పరిహారం లభించే అవ కాశం ఉందని ఆమె వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక పంపాలని తహసీల్దారు బి.నీల కంఠరావుకు సూచించారు.

ఉన్నట్టుండి.. ఊపిరి వదిలి

శృంగవరపుకోట: నడుచుకుంటూ వెళ్తుండగా మూర్ఛ వచ్చి తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఎస్.కోట మండలం వెంకట రమణ కూడలి సమీపంలో విశాఖ- అరకు రహ దారి పక్కన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన ఎం.రమేష్(45) కొంతకాలంగా ఎస్.కోటలోని ఓ కార్ఖానాలో పనిచే స్తున్నారు. దుకాణ యజమాని కొన్ని రోజులుగా అందుబాటులో లేకపోవడంతో అతడికి పనిలే కుండా పోయింది. మంగళవారం మధ్యాహ్నం వెంకటరమణపేట వైపు నడుచుకుంటూ వెళ్లే క్రమంలో మూర్ఛ రావడంతో కింద పడిపోయాడు. స్థానికులు గమనించి అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. సమీపంలోని ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందారు. సీఐ నారాయణమూర్తి మృతదే హాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు


మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ

విజయనగరం కోట, న్యూస్‌టుడే: కార్తికమాసం సోమవారం పర్వదినాల్లో భక్తులకు పంచారామాల దర్శనం కల్పించేందుకు విజయనగరం నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవంబరు 3, 10, 17, 24వ తేదీల్లో సాయంత్రం 4 గంటలకు విజయనగరం డిపో నుంచి బస్సులు బయల్దే రుతాయని చెప్పారు. అమరావతి (అమరేశ్వ రుడు), పాలకొల్లు (రామలింగేశ్వరుడు), భీమ వరం (సోమేశ్వరుడు), ద్రాక్షారామం (భీమేశ్వ రుడు), సామర్లకోట(కొమరలింగేశ్వరుడు) ఆల యాల దర్శనానంతరం తిరిగి మంగళవారం తెల్లవారుజామున జిల్లా కేంద్రానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు ముందుగా www.apsrtconline.in వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని, జిల్లాలోని ఏ ప్రాంతం వారైనా బుక్ చేసుకుంటే అక్కడి నుంచి బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. వెళ్లి వచ్చేందుకు ఒకరికి సూపర్ లగ్జరీ రూ.2 వేలు, అల్ట్రాడీలక్స్ రూ.1950, ఎక్స్‌ప్రెస్ రూ.1,600 ఛార్జీలుగా ఉంటాయన్నారు.

అయ్యప్ప క్షేత్ర దర్శనానికి..

శబరిమల అయ్యప్ప క్షేత్ర దర్శనానికి వెళ్లే భక్తులకు బస్సులు కావాలంటే ఏర్పాటు చేస్తా మని డీపీటీవో తెలిపారు. కార్తికమాసం పిక్ని క్‌ల కోసం ప్రత్యేకంగా విశాఖ, అరకు, పుణ్య గిరి, లంబసింగి, అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీము ఖలింగం, టెక్కలి, రావివలస తదితర క్షేత్రా లకు బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. వివ రాలకు డిపో ప్రబంధకుడు శ్రీనివాసరావు లేదా 99592 25620, 73829 21380, 94403 59596 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇంజినీరింగ్ అధికారులకు డివిజన్ల కేటాయింపు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో కొత్తగా బదిలీపై వచ్చిన డీఈఈ, ఏఈలకు నగరపాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య డివిజన్లు కేటాయించారు. ఈఈ టి.రాయ ల్‌బాబు పర్యవేక్షణలో వీరంతా విధులు నిర్వర్తించనున్నారు. సివిల్ పనులు, వీధి దీపాల నిర్వహ ణకు సంబంధించి ఒకటి నుంచి 15 డివిజన్ల వరకు డీఈఈ పీఎస్‌వీవీ ప్రసాద్, 16 నుంచి 35 వరకు ఎం.శ్రీనివాసరావు, 36 నుంచి 50 డివిజన్లకు మణికుమార్ పర్యవేక్షిస్తారు. వీరి ఆధ్వర్యంలో ఏఈలు సీహెచ్ పార్వతి, సూరినాయుడు, ఎస్.రవికుమార్ పనులు చూస్తారు. నీటి సరఫరా విభాగం ఒకటి నుంచి 25 వరకు ఎం.శ్రీనివాసరావు, మణికుమార్‌కు కేటాయించారు. వీరి ఆధ్వ ర్యంలో ఏఈలు సూరినాయుడు, రవికుమార్ పనిచేస్తారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరం కేంద్రీయ విశ్వవిద్యాలయం నెక్ శిక్షణ కేంద్రంలోని స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణకు నిరు ద్యోగ పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపు ణ్యాధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ప్లంబర్, ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండిషనర్ కోర్సుల్లో శిక్షణ ఉంటుంద న్నారు. 18 నుంచి 45 లోపు వయసు కలిగి, ఎనిమిదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 94405 527678, 93982 86654 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గడువు పెంపు..: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రాతపరీక్ష నిమిత్తం ఇవ్వనున్న ఉచిత రెసిడెన్షియల్ డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడువు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచా లకుడు రామానందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అభ్యంతరాలు తెలపాలి

పార్వతీపురం పట్టణం: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా వెబ్‌సైట్లో పొందుపర్చా మని డీఈవో పగడాలమ్మ తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 24 లోపు డీఈవో కార్యాలయంలో తెలియజేయా లన్నారు. జిల్లాలోని 33 పోస్టులకు 700 మంది దరఖాస్తు చేసుకున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

మెనూ.. ఆస్వాదిస్తూ తిను

మధ్యాహ్న భోజనంలో మార్పులకు ప్రతిపాదన


భోజనం చేస్తున్న విద్యార్థులు

వారం	ప్రస్తుత మెనూ	ప్రతిపాదనలు ఇలా
సోమ	హాట్ పొంగల్, కూరగాయల పలావ్/ ఉడికించిన కోడిగుడ్డు, చిక్కి	కూరగాయల పలావ్, కోడిగుడ్డు కూర, చిక్కి
మంగళ	పులిహోర, దొండకాయ పచ్చడి ఉడికించిన గుడ్డు, రాగిజావ	అన్నం, పప్పుచారు, గుడ్డుకూర రాగిజావ
బుధ	కూరగాయల అన్నం, బంగాళదుంప కూర, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కి	అన్నం, కోడిగుడ్డు పులుసు, చిక్కి
గురు	సాంబార్‌బాత్/ లెమన్ రైస్, టమాటా పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ	అన్నం, టమాటా రసం, కాయగూర కూర (పప్పుతోకూడిన), ఉడికించిన గుడ్డు, రాగిజావ
శుక్ర	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కి	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కి
శని	అన్నం, ఆకుకూర, పప్పుచారు, తీపి పొంగలి రాగిజావ	పులిహోర, బంగాళదుంప కుర్మా, తీపి పొంగలి, రాగిజావ

న్యూస్‌టుడే- రాజాం

ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం మెనూలో మార్పులు చేసేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆయా ప్రాంతల వాసుల అభిరుచికి తగ్గట్టు విద్యార్థులకు భోజనం అందించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై జిల్లా స్థాయిలోనే తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్య కమి టీలు, హెచ్ఎంలు, ఎంఈవోలు, వంట నిర్వాహకులతో సమా వేశం నిర్వహించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది. ఈ మేరకు సెప్టెంబరు 3న జిల్లా పాలనాధికారి సమావేశం నిర్వ హించి.. మెనూ తయారు చేశారు. పోషక విలువలపై వైద్య నిపుణుల అభిప్రాయాలు తీసుకుని తుది అను మతులకు ప్రభుత్వానికి నివేదిం చారు. అనుమతి వస్తే అమలు చేస్తారు. దీంతో విద్యార్థులంతా బడుల్లో భోజనం చేస్తారని భావిస్తున్నారు.

జిల్లాలో వివరాలిలా..

విభాగం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	1,316	45,675
ప్రాథమికోన్నత	181	38,830
ఉన్నత	248	28,986

ప్రతిపాదనలు పంపించాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు సమష్టి అభిప్రా యాలను తీసుకుని క్రోడీకరించాం. కొత్త మెనూ ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం అన్ని జిల్లాల నుంచి ప్రతిపాదనలను కోరింది. తుది నిర్ణయం ప్రభుత్వం తీసుకుం టుంది. – పి.ప్రేమ్‌కుమార్, డీఈవో

పైపులైనుకు మరమ్మతులు



విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరంలోని కంటోన్మెంట్ ప్రాంతం చాకలివీధిలో కాలువ నుంచి వెళ్తున్న తాగునీటి పైపులైనుకు లీకులు పడ్డాయి. నీరు కలుషితమై అనారోగ్యాల బారినపడతామని అక్కడ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఈనెల 22న 'కాలువల్లో ప్రజారోగ్యం' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ కమిషనరు నల్లనయ్య స్పందించారు. సిబ్బందితో కాలువల్లో ఉన్న పైపులు పైకి మార్పిస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

గుంతల పూడ్చివేత



బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని బొబ్బిలి ఆసుపత్రి ప్రధాన రహదారిలో ఉన్న పైపులైన్ల లీకేజీలకు సంబంధించిన గోతులను మంగళవారం అధికారులు పూడ్చివేశారు. ఇటీవల పైపులైన్ల మరమ్మతుల కోసం రహదారిని తవ్వి వదిలేశారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో వచ్చిన పలు కథనాలకు కమిషనర్ రామలక్ష్మి స్పందించారు. కాంక్రీటు మిశ్రమంతో గోతులను పూడ్పించారు.

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

హామీలన్నీ నెరవేరుస్తాం

రాజాం, న్యూస్‌టుడే: ఎన్డీయే కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఇప్పటికే పింఛన్ల లబ్ధిని పెంచి అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించామన్నారు. దీపావళి నుంచి మూడు గ్యాస్ సిలిండర్లను అందిస్తామని వెల్లడించారు. మంగళవారం రాజాం రహదారి విస్తరణ పనులను పరిశీలించిన ఆయన వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రక్షిత పథకం శుభ్రం

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి ఉపాధ్యాయ కాలనీలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకును శుభ్రం చేశారు. ఈనెల 20న 'ట్యాంకులు అధ్వానం.. జలాలు కలుషితం' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, క్లోరినేషన్ జరిపిన నీటిని ప్రజలకు అందిస్తామని తెలిపారు.

స్పందనకు వందనం


ట్యాంకు మూత ఏర్పాటు

వంగర, న్యూస్‌టుడే: కొప్పరవలస తాగునీటి పథకం ట్యాంకుకు పైకప్పు లేక పోవడంతో పక్షులు నీటికి వెళ్లి, పడి చని పోతున్నాయని, జలం కలుషితం అవుతోందని ఈనెల 21న 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జేఈ శ్రీచరణ్, కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో పథకం శుభ్రం చేసి, కప్పు ఏర్పాటు చేశారు.




చిన్నారుల వ్యాసం.. స్ఫూర్తి సందేశం

రాజాం పట్టణంలోని భాష్యం పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం 'ప్రతిభా పాటవ పోటీలు' జరిగాయి. 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు', 'విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జి.చైత్ర (9వ తరగతి), ఎ.భావన (10వ తరగతి), డి.భావన (8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ ఎం.నాగరాజు, హెచ్‌ఎం సుజాత చౌదరి విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. - న్యూస్‌టుడే, రాజాం




ప్రతిభ చాటారు

బొబ్బిలి పట్టణంలోని భాష్యం పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం 'ప్రతిభా పాటవ పోటీలు' జరిగాయి. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు', 'విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఆర్.సాయిశ్రీవల్లి(8వ తరగతి), దినేష్ కార్తీక్(9వ తరగతి), పి.వరుణ్‌తేజ(9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ రేవతి, ఉపాధ్యాయులు భగవాన్, సురేష్, విశ్రాంత ఉపాధ్యాయుడు సాయిబాబా ప్రశంసాపత్రాలు అందించారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి

ప్రతిపాదనల్లోనే పట్టణాభివృద్ధి


సగంలో ఆగిపోయిన రాణిమల్లమ్మదేవి పార్కు గట్టుపై నడక దారి నిర్మాణం

బొబ్బిలి పట్టణానికి చారిత్రకంగా ఎంతో పేరుంది. పురాతన కట్టడాలను సందర్శించేందుకు ఏటా పర్యాటకులు వస్తుంటారు. కానీ ఆ స్థాయిలో పర్యాటకంగా అభివృద్ధి చెందలేదు. ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధి లేక.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కొన్ని పనులు ప్రతిపాదనలకే పరిమితం కాగా.. మరికొన్ని అసంపూర్తిగా మిగిలాయి. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి

పనుల నిర్వహణలో నిర్లక్ష్యం

రాణిమల్లమ్మదేవి పార్కు అభివృద్ధికి రూ.10 లక్షలతో నడక దారి తలపెట్టి, మధ్యలో వదిలేశారు. ల్యాండ్ స్కేపింగ్ పనుల్లో భాగంగా పైభాగంలో దిగువ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. పచ్చదనాన్ని మరిచారు. ఈ పనులకు రూ.5 లక్షల ఖర్చు చూపించారు. భైరవసాగరం, రాణిమల్లమ్మదేవి పార్కు, కోట చెరువులో బోటు షికారు ప్రతిపాదనల్లోనే ఆగింది. ప్రధాన కూడళ్ల అభివృద్ధి ప్రతిపాదనలకే మిగిలింది. బొబ్బిలి హస్తకళల ప్రాధాన్యత చాటేలా క్రాఫ్ట్ బజారు ఏర్పాటు పేరుతో రూ.30 లక్షలు భవన నిర్మాణాలకు ఖర్చు చేసి, వదిలేశారు. బుడా నిధులతో చేపట్టిన అమ్మిగారి కోనేరు గట్టు వద్ద కూడలి అభివృద్ధి అసంపూర్తిగా ఉంది. ఇండోర్‌స్టేడియం పనుల్ని వదిలేశారు.

చొరవ చూపాలి

ఐటీఐ కాలనీ వద్ద నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తీసుకువస్తే అందులో క్రాఫ్ట్ బజారు ఏర్పాటు చేయొచ్చు. యుద్ధస్తంభం వద్ద భైరవ సాగరం గట్టుపై సుమారు రూ.50 లక్షలతో ల్యాండ్ స్కేపింగ్, కాటేజీలు ఏర్పాటు చేశారు. పదేళ్లుగా వినియోగించడం లేదు. కాటేజీల అద్దెకు కేటాయిస్తే ఆదాయం వస్తుంది.

సిద్ధం చేస్తాం

పట్టణాన్ని పర్యాటకంగా మార్చేందుకు కొత్తగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. నిరుపయోగంగా ఉన్న భవనాలు వాడేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే తలపెట్టిన పనుల పూర్తికి చర్యలు చేపడతాం. - ఎల్.రామలక్ష్మి, పురపాలక కమిషనర్, బొబ్బిలి

తాగునీటి పరీక్షలు చేయండి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అతిసారం, జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, 15 రోజులకు ఒకసారి తప్పక తాగునీటి పరీక్షలు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ డిల్లీశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. బొబ్బిలి మండల పరిషత్తు కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగు సహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై, మాట్లాడారు. ఇప్పటికే తాగునీటి పరీక్షా కిట్లు ప్రతి సచివాలయానికి అందించామన్నారు. ట్యాంకులు శుభ్రం చేసిన తరువాత తప్పక క్లోరినేషన్ చేయాలన్నారు. ఏఈ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డీ భాస్కరరావు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. వీధులు అపరిశుభ్రం



చీపురుపల్లిలోని విజయనగరం-పాలకొండ ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చెత్తతో నిండిపోయాయి. పోలీసు వీధి, మార్కెట్ వీధిలోనూ ఇదే పరిస్థితి. జ్వరాలు వస్తాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేస్తామని పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాలరావు అన్నారు. - న్యూస్‌టుడే, చీపురుపల్లి

అగ్నివీర్ ఉద్యోగాలకు 17 మంది ఎంపిక

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కోమటిపల్లి బీసీ సంక్షేమ శాఖ బాలుర కళాశాల వసతి గృహంలో చదువుతున్న 17 మంది అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇక్కడ డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థులు ఉంటున్నారు. 20 మంది ఎంపికకు హాజరు కాగా 17 మంది అర్హత పొందినట్లు సంక్షేమాధికారి సత్యనారాయణ తెలిపారు. వీరంతా ఇటీవల దేశ రక్షణ రంగం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. ● కోమటిపల్లి సమీప కేటీఆర్ అకాడమీలో శిక్షణ పొందిన 35 మంది అభ్యర్థులు అగ్నివీర్‌కు ఎంపికైనట్లు నిర్వాహకుడు తిరుపతిరావు తెలిపారు.


ఎంపికైన యువకులు

ముందస్తు చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సందీప్

గంట్యాడ, న్యూస్‌టుడే: వర్షాలు, తుపాను హెచ్చరికల నేపథ్యంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ సందీప్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. అతిసారం, విషజ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మంచినీటి ట్యాంకుల శుద్ధి, క్లోరినేషన్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో ఆర్వీ రమణమూర్తి, తహసీల్దారు నీలకంఠేశ్వర రెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు జైహింద్‌కుమార్, ఈవోపీఆర్డీ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం


చిన్నారులతో ముచ్చటిస్తున్న పీడీ

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మాతాశిశు ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా అంగన్‌వాడీ సిబ్బంది పనిచేయాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి అన్నారు. మంగళవారం బుడతనాపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, మాట్లాడారు. తల్లీబిడ్డ తప్పకుండా పోషకాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీల్లో కిచెన్ గార్డెన్ నిర్వహణతో పాటు ఇంటింటా మహిళలు కూరగాయలు పండించేలా అవగాహన పెంచాలన్నారు. అనంతరం దస్త్రాలను పరిశీలించి, చిన్నారులతో ముచ్చటించారు.

గ్రామస్థుల ఇబ్బందులు పరిష్కరిస్తాం


స్థానికులతో మాట్లాడుతున్న ఏవీపీ పట్టాభిరామిరెడ్డి తదితరులు

రేగిడి, న్యూస్‌టుడే: చిన్నయ్యపేట గ్రామస్థులతో ఈఐడీ ప్యారీ అధికారులు మంగళవారం సమావేశమై, చర్చించారు. ఈనెల 21న కర్మాగారం ముందు గ్రామస్థులు కాలుష్యం వ్యాప్తిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పరిశ్రమ అధికారులు స్పందించారు. ఏవీపీ పట్టాభిరామిరెడ్డి, కేన్ డీజీఎం ఆర్.రమేష్ తదితర అధికారులు సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమాలపై దర్యాప్తునకు ఆదేశం

గజపతినగరం, న్యూస్‌టుడే: మరుపల్లి ఆదర్శ పాఠశాల ప్రధానాచార్యుడు అక్రమాలకు పాల్పడ్డాడని వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేయాలంటూ డీఈవో మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఓ విద్యార్థికి చెందిన హాజరు, ఇతర వ్యవహారాల్లో ప్రధానాచార్యుడు అవకతవకల ఆరోపణలపై విచారణ చేసి, వెంటనే నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

సాగునీటి సంఘాలకు ఎన్నిక

తెర్లాం, న్యూస్‌టుడే: మండలంలో 18 సాగునీటి సంఘాలకు ఎన్నిక నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ఇరిగేషన్ ఏఈ హరి చెప్పారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో 18 చెరువుల కింద 3,886 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉందన్నారు. నెలలోపు ఎన్నిక ప్రక్రియ ముగుస్తుందని వివరించారు.

పాడి రైతుల ఆందోళన

రాజాం, న్యూస్‌టుడే: పాల ధర తగ్గించడాన్ని నిరసిస్తూ రైతులు పట్టణంలోని ఓ ప్రైవేటు డెయిరీ ప్రాంతీయ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పాల ధరను పెంచాల్సిందిపోయి తగ్గించడం దారుణమని మండిపడ్డారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 26లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రమణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్టు, మెకానిక్, వెల్డర్ ట్రేడ్లలో ఖాళీలను కౌన్సిలింగు ద్వారా భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

1,000 ఇంకుడు గుంతలు తవ్వించాలి

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: 35 పంచాయతీల్లో 1,000 ఇంకుడు గుంతలు తవ్వించాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు మంగళవారం డ్వామా కార్యాలయం నుంచి సమాచారం వచ్చినట్లు తెలిపారు. సాంకేతిక, క్షేత్ర సహాయకులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను గుర్తించాలన్నారు.

మద్యం దుకాణం ఎదుట నిరసన

బొబ్బిలి, న్యూస్‌టుడే: మేదరబంద కూడలిలో మద్యం దుకాణం వద్దంటూ మంగళవారం మహిళలు ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సాయంత్రం దుకాణం ముందు బైఠాయించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు వారి నిరసనకు మద్దతు తెలిపారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని రాణిమల్లమ్మదేవి పార్కు గట్టుపై సోమవారం గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. సదరు వ్యక్తి జెండావీధికి చెందిన కె.గౌరీశంకర్‌గా గుర్తించినట్లు సీఐ సతీష్‌కుమార్ చెప్పారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తుపానుపై అప్రమత్తత అవసరం

తెర్లాం, బొబ్బిలి గ్రామీణం, దత్తిరాజేరు, బొండపల్లి, న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకాధికారి వీటీ రామారావు అన్నారు. తెర్లాంలో కార్యదర్శులు, వీఆర్వోలు, అన్ని శాఖల అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దత్తిరాజేరులో ప్రత్యేకాధికారి శాంతకుమారి, బొబ్బిలిలో ఎంపీడీవో రవికుమార్, బొండపల్లిలో తహసీల్దారు డి.రాజేశ్వరరావు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

సరకులు సక్రమంగా పంపిణీ చేయండి

వంగర, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ డిపో సరకులు సకాలంలో, సక్రమంగా సరఫరా చేయాలని తహసీల్దారు ధర్మరాజు, పౌర సరఫరాల ఉపతహసీల్దారు పి.రామారావు అన్నారు. మంగళవారం 48 రేషన్ డిపోల డీలర్లతో సమావేశమై, మాట్లాడారు. సకాలంలో డీడీలు తీసి, లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

సమస్యలదే రాజ్యం.. పనుల్లో జాప్యం

న్యూస్‌టుడే, రాజాం

రాజాం పంచాయతీ నుంచి నగర పంచాయతీ.. ఆపై పురపాలికగా మారింది. కానీ దీనికి అనుగుణంగా అభివృద్ధి పనులకు నోచుకోవడం లేదు. దీనికితోడు ఇటీవల పురపాలకకు ఆర్థిక సంఘం నిధులను కేంద్రం నిలిపేయడం పుండు మీద కారం చల్లినట్లయింది. ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇటీవల పద్దులో రావాల్సిన నిధులు అందకుండా పోయాయి. అంతకు ముందు మంజూరైన నిధులతో ప్రతిపాదించిన పనులు సైతం చేపట్టలేదు. గతంలో చేసిన పనులకు బిల్లుల చెల్లింపు గత వైకాపా హయాంలో నిలిచిపోవడంతో గుత్తేదారులు ఆచితూచి ముందడుగు వేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పనుల్లో కదలిక వచ్చింది. ఇసుక కోసం చాలా మంది గుత్తేదారులు ఎదురుచూస్తున్నారు. డోలపేట, వరలక్ష్మినగర్, విద్యానగర్, పాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని పలు వీధులు రహదారులు, కాలువలకు నోచుకోలేదు. మారుతీనగర్‌లోని మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. అయిదో లైనులో వరద కాలువ నిర్మించాలని విన్నవిస్తున్నా ముందడుగు పడలేదు. సమస్యలను కమిషనర్ జె.రామఅప్పలనాయుడు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా.. పట్టణాభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.


సీసీ రహదారికి నోచుకోని డోలపేటలోని వీధి




కాలువల్లో ప్రజారోగ్యం

నేటిచిత్రం

మెంటాడ మండలం గుర్ల గ్రామంలో పలుచోట్ల తాగునీటి కుళాయిలు, ప్రధాన పైపులైన్లు మురుగు కాలువల్లో ఉన్నాయి. లీకేజీలు ఉన్నాయని, తాగునీరు కలుషితం అవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, మెంటాడ

క్రీడల్లో విద్యార్థుల సత్తా

చీపురుపల్లి గ్రామీణం, గుర్ల, గంట్యాడ గ్రామీణం, మెంటాడ, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం కర్లాం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బాణాన హరీష్ జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు సీనియర్ విభాగంలో ఎంపికైనట్లు హెచ్‌ఎం కామేశ్వరి, పీడీ చంద్రశేఖర్ తెలిపారు. గుర్ల మండలం చింతలపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.మురళీ, తేజ, పిల్ల హేమంత్, జ్యోతిసాయి, లావణ్య రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ లక్ష్మణ్ తెలిపారు. వల్లాపురం ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి త్రోబాల్, ముగ్గురు కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని పీడీ ప్రసాదరావు, హెచ్‌ఎం అప్పారావు తెలిపారు. కొండగంగ్రేడుకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని పీడీ సుధారాణి తెలిపారు. హెచ్‌ఎం వెంకటరావు అభినందించారు. విజయనగరంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-14, 17 కబడ్డీ పోటీల్లో గంట్యాడ మండలం పెదవేమలి పాఠశాల విద్యార్థులు పి.లక్ష్మి, పి.వెంకీ, వై.భవానీ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ తెలిపారు. మెంటాడ మండలం జయతి ఉన్నత పాఠశాల విద్యార్థిని యు.మౌనిక రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రామారావు తెలిపారు.


పెదవేమలి విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



గుర్ల: చింతలపేట పాఠశాల గురువులతో క్రీడాకారులు


కర్లాం పాఠశాల బాలబాలికలు

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? రామభద్రపురం పంచాయతీ అగురు, యాత వీధుల్లో సీసీ రహదారులు, కాలువలు నిర్మించాలి.
- స్థానికులు

● నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తాం. - రమేష్, ఏఈ
– న్యూస్‌టుడే, రామభద్రపురం

? బొండపల్లి గ్రామంలోని గొల్ల వీధిలో మురుగు ఇళ్ల మధ్య నిల్వ ఉంటోంది. - స్థానికులు

● పరిశీలించి, చర్యలు చేపడతాం.
- రఘుపతిరావు, ఈవోపీఆర్డీ
– న్యూస్‌టుడే, బొండపల్లి

హోరాహోరీగా పోటీలు

మెంటాడ, న్యూస్‌టుడే: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం సొంతం అవుతుందని డీడీఈవో మోహనరావు అన్నారు. మంగళవారం పోరాంలో అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. మొత్తం 400 మంది క్రీడాకారులు పాల్గొని పరుగు, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ క్రీడల్లో తలపడ్డారు. పీడీ కె.తవిటినాయుడు తదితరులు పర్యవేక్షించారు.


లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థి

అయిదుగురికి అతిసారం లక్షణాలు

దత్తిరాజేరు, గజపతినగరం, న్యూస్‌టుడే: కన్నాం గ్రామానికి చెందిన ముగ్గురు, కెంగువకి చెందిన ఇద్దరు అతిసారం లక్షణాలతో గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. కెంగువ గ్రామంలో తాగునీటి వనరులు, కాలువలను ఆర్డీవో రామ్మోహనరావు, పరిశీలించారు. వ్యాధి లక్షణాలు తగ్గే వరకు ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తామని ఎంపీడీవో కల్యాణి, తహసీల్దారు రత్నకుమార్ తెలిపారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి గ్రామంలో శిబిరం ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మెరకముడిదాం, న్యూస్‌టుడే: రాచగుమడాం, భీమవరం, రామాయవలస, సాతాంవలస గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర తెదేపా కార్యదర్శి కిమిడి రామమల్లిక్‌నాయుడు శంకుస్థాపన చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు టి.సన్యాసినాయుడు, మాజీ ఎంపీపీ కె.మోతీలాల్‌నాయుడు, నాయకులు రమణమోహనరావు, ధనంజయ, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగాలో మెరుపులు

న్యూస్‌టుడే బొబ్బిలి గ్రామీణం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న కాలానికి అనుగుణంగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా దోహదపడుతోంది. ఆసనాల వల్ల అవయవాల పనితీరు మెరుగుపడుతుంది. ఇటీవల పాఠశాలల్లోనూ యోగా ఉపాధ్యాయులను నియమించారు. ఆయుర్వేద ఆసుపత్రుల్లోనూ యోగా శిక్షకులను నియమించగా.. వారు వారానికి మూడు రోజులు పాఠశాలకు వెళ్లి యోగా నేర్పిస్తున్నారు. విద్యార్థులు ఆసక్తిగా సాధన చేస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో బొబ్బిలి విద్యార్థినులు ప్రతిభ చూపారు.


డింపుల్

జాహ్నవి ప్రతిభ

ఆసనం వేసిన కావ్య

రాష్ట్రస్థాయి పోటీలకు..

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈనెల 16న జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో అండర్-14 విభాగంలో బొబ్బిలి మండలం నారసింహునిపేట ఉన్నత పాఠశాల 6వ తరగతి విద్యార్థిని కారంగి కావ్య, కోమటిపల్లి ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని ఎల్.జాహ్నవి, బొబ్బిలి కేజీబీవీ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కె.డింపుల్ ప్రతిభ చూపినట్లు పీడీలు శశికళ, రాజేశ్వరి తెలిపారు. వీరు త్వరలో బాపట్లలో జరగనున్న పోటీల్లో పాల్గొనబోతున్నారని చెప్పారు.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట





ప్రతిభ చూపారు

విజయనగరంలోని దాసన్నపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు-విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో బి.పావని(పదో తరగతి), టి. అన్నపూర్ణేశ్వరి (తొమ్మిదో తరగతి), ఎం. వర్షిణి (తొమ్మిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.రమణమ్మ, ఉపాధ్యాయులు ఇజ్జిరోతు రామునాయుడు, సి.హెచ్.వి. రత్నం, యూవైఏఎన్.రాజు, కె.తౌడు విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు

విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరానికి చెందిన పలువురు విద్యార్థులు తైక్వాండో, కబడ్డీ, వెయిట్ లిఫ్టింగ్ తదితర పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. ఈ నెల 6న తిరుపతిలో నిర్వహించిన అంతర జిల్లా ఛాంపియన్‌షిప్‌లో వై.కారుణ్య రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం, మంగళగిరిలో ఈనెల 9 నుంచి 12 వరకు జరిగిన ఓపెన్ కబడ్డీ మహిళా టోర్నమెంట్‌లో నీలిమ ప్రథమస్థానం సాధించారు. ఉత్తరాంధ్ర ఓపెన్ కబడ్డీలో కళాశాల విద్యార్థులు రమ్య, సీత, మాధవి, శ్రీవల్లి ప్రథమ బహుమతి దక్కించుకున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన యూత్ జూనియర్, సీనియర్ జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 71 కిలోల విభాగంలో ఎస్.పల్లవి విజేతగా నిలిచింది. క్రీడాకారులను మంగళవారం ఆయా యాజమాన్యాలు సత్కరించి, అభినందనలు తెలియజేశారు.



కారుణ్య పల్లవి నీలిమ

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నెల్లూరులో ఇటీవల జరిగిన ఇంటర్ సర్కిల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ టీమ్ ఛాంపియన్‌షిప్ 2024-25లో ఈపీడీసీఎల్ విజయనగరం సర్కిల్ క్రీడాకారులు ద్వితీయ స్థానం సాధించారు.

25న ముత్యాలమ్మ వనం ప్రతిష్ఠ

జరజాపుపేట(నెల్లిమర్ల): జరజాపుపేటలో ఈనెల 25న ముత్యాలమ్మతల్లి వనం ప్రతిష్ఠకు సర్వం సిద్ధం చేశారు. 24న ఉదయం 9 గంటలకు గ్రామ పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపడతారు. అనంతరం 25న అమ్మవారి వనం వద్ద యంత్ర ప్రతిష్ఠోత్సవం, మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



వనానికి వెళ్లే మార్గంలో ముఖద్వారం

నగర జీవనం.. సమస్యలమయం

న్యూస్‌టుడే – విజయనగరం

విజయనగరం నగరపాలక పరిధిలోని ప్రజల అవస్థలు అన్నీఇన్నీ కాదు. నగర వాసులు నిత్యం పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిసరాలు అధ్వానంగా, వ్యాధులకు నిలయంగా ఉంటున్నాయి. పలుచోట్ల డంపర్‌బిన్లు పాడై చెత్త అంతా రహదారులపైనే పేరుకుపోతోంది. 35వ డివిజన్ ఝాన్సీ నగర్‌లో నీరు రంగు మారి వచ్చిందని, నిత్యం చిన్న దార వస్తోందని స్థానిక మహిళలు ఆందోళన వ్యక్తం చేసినా.. పట్టించుకునే నాథుడే కరవయ్యారు.



మర్రి చెన్నారెడ్డి కాలనీలో మూడేళ్లుగా వినియోగంలో లేని సామాజిక మరుగుదొడ్డి

నగరంలోని 37వ డివిజన్ బీసీ కాలనీలో ఇప్పటి వరకు కొత్త కుళాయిలు ఇవ్వలేదని స్థానికులు వాపోతున్నారు. ఈ కాలనీకి వెళ్లే ప్రధాన దారి గోతులమయమైంది. ప్రస్తుతం ఎనిమిది అడుగులు మాత్రమే ఉందని, మరమ్మతులతో పాటు రహదారిని విస్తరించాలని కోరుతున్నారు. వీధి దీపాలు వెలగటంలేదని, క్లాప్‌వాహనం రావడం లేదని చెబుతున్నారు. దోమల బెడద అధికంగా ఉందని, ఫాగింగ్ చేయడం లేదంటున్నారు. ఇళ్ల మధ్యలోనే విద్యుత్తు స్తంభాలు, తీగలు ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పాఠశాలలోని కుళాయిలను ఆకతాయిలు విరగ్గొట్టి, చోరీకి పాల్పడుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. కొత్త మజ్జిపేట చెరువు నాచుపట్టి అపరిశుభ్రంగా ఉంది. గత ప్రభుత్వం హయాంలో వీటీ అగ్రహారం దారిలోని బస్‌షెల్టర్‌ను కూల్చేసి మళ్లీ నిర్మించకుండా వదిలేశారు.



అధ్వానంగా బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన దారి..

అపరిశుభ్రంగా పరిసరాలు..

కణపాక మండల పరిషత్తు ఆదర్శ పాఠశాల వద్ద డంపర్ బిన్ పాడై చెత్త కింద పడుతోంది. కణపాక, హరిజన వీధి, చిన్నారెడ్డి కాలనీ తదితర చోట్ల కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారెడ్డి కాలనీలోని సామాజిక మరుగుదొడ్డి మూడేళ్ల నుంచి నిరుపయోగంగా ఉందని చెబుతున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని మహిళలు అంటున్నారు. రహదారులు, కాలువలు మరమ్మతులకు గురయ్యాయని, కణపాకకు వెళ్లే ప్రధాన రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోయాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లమాదప్పవీధి దారిలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఒరిగి ఉంది.

సమస్యలు పరిష్కరిస్తాం..

అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనరు పి. నల్లనయ్య తెలిపారు. ● విద్యుత్తు సమస్యలు పరిష్కరిస్తామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాథరావు చెప్పారు.



మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	80085 74319

?: జడ్డేటివలసలో మధ్యాహ్నం రెండు గంటలు మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారు. **- మహిళలు, జడ్డేటివలస**

● రోజూ ఉదయం కుళాయి నీరు సరఫరా అయ్యేలా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీచేస్తాం. **- పార్వతీ, జేఈ,**

– న్యూస్‌టుడే, జామి

?: వుడాకాలనీ ఫేజ్-2లో వీధి దీపాలు వెలగడం లేదు. **- బి.రామకృష్ణ, స్థానికులు**

● దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటాం. **- రమణ, లైటింగ్ సూపర్ వైజర్**

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

25న సర్వసభ్య సమావేశం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 25న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు సీఈవో బి.వి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. సభ్యులు హాజరుకావాలని కోరారు.

గాదెకు మద్దతుగా ప్రచారం

శృంగవరపుకోట: వచ్చే శాసన మండలి ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేయనున్న గాదె శ్రీనివాసులనాయుడుకు మద్దతుగా పీఆర్టీయూ మంగళవారం ప్రచారం నిర్వహించింది. నవంబరు 6లోగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆయుధాల వినియోగంపై అవగాహన

డెంకాడ, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చింతలవలస అయిదో బెటాలియన్‌లో కమాండెంట్ మలికా గార్గ్ ఆధ్వర్యంలో మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయుధాల వినియోగం, కమ్యూనికేషన్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం చేపట్టే వివిధ సహాయక కార్యక్రమాలు గురించి వివరించారు. అనంతరం కమాండెంట్ మలికా గార్గ్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో భవిష్యత్తులో అన్ని విషయాలపై ఆసక్తి విషయలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. అనంతరం వివిధ అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అదనపు కమాండెంట్ పి. సత్తిబాబు, సహాయ జి.వి.ప్రభాకరరావు, ఎస్.బాపూజీ పాల్గొన్నారు.



రబ్బరు బోటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

వాకర్స్‌క్లబ్‌లు సమాజానికి పట్టుకొమ్మలు



దత్తసాయి వాకర్స్ క్లబ్ సభ్యులతో నారాయణస్వామి తదితరులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: వాకర్స్ క్లబ్‌లు సమాజానికి పట్టుకొమ్మలని జిల్లా 102 గవర్నర్ జామి నారాయణ స్వామి అన్నారు. మంగళవారం కొత్తపేట నీళ్లట్యాంకు ప్రాంతంలోని మహారాణి అప్పలకొండయాంబ రాక్ గార్డెన్‌లో దత్తసాయి వాకర్స్ నూతన క్లబ్ ప్రారంభోత్సవం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ముందుగా దత్తసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. తర్వాత నూతన క్లబ్ అధ్యక్షురాలు శేషశైలజ, ప్రధాన కార్యదర్శి సంతోషి, కోశాధికారి పైడిరాజు మిగిలిన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. మాజీ గవర్నర్లు, పలు క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

తుపాను సమయంలో అప్రమత్తం

పూసపాటిరేగ, ఎస్.కోట, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా ప్రత్యేక ఉప కలెక్టర్ జోసెఫ్ అన్నారు. మంగళవారం పూసపాటిరేగ ఎంపీడీవో కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమీక్షించారు. తీరప్రాంతంలో విధి నిర్వహణకు అధికారులను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేయాలన్నారు. ● తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఎస్.కోట మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. ముంపు, కొండ చరియలు విరిగి పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. గిరిశిఖర ప్రాంత గర్భిణులను ముందుగా ఆసుపత్రులకు తరలించాలని సూచించారు.



మాట్లాడుతున్న ప్రత్యేక ఉప కలెక్టర్ జోసెఫ్

సభ్యత్వ నమోదులో ప్రథమస్థానంలో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం సైనికుల్లా పనిచేసిన కార్యకర్తలు తెదేపా సభ్యత్వ నమోదులోనూ అదే రీతిలో పనిచేయాలని ఎమ్మెల్యే లలితకుమారి పేర్కొన్నారు. మంగళవారం ఎల్.కోటలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రజాభీష్టం మేరకు ఒదుగుతూ ఎదగాలని, తెదేపాకు కార్యకర్తలే కంచుకోట అన్నారు. సభ్యత్వ నమోదులో తామే ప్రథమస్థానంలో నిలవాలని, స్థానిక సంస్థల ఎన్నికలకు సమయాత్తం కావాలని ఆమె సూచించారు. పర్యాటకశాఖ డైరెక్టర్ సుధా రాజు, కె. ఈశ్వరరావు, తెదేపా నేతలు, నాయకులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థికి అభినందన

విజయనగరం విద్యావిభాగం: తెలంగాణ డీఎస్సీలో మొదటి ర్యాంకు సాధించిన మహారాజ విద్యా కళాశాల పూర్వ విద్యార్థి కొల్లూరి వెంకటనాగ శ్రీరామ్‌ను మంగళవారం కళాశాలలో అభినందించారు. మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కేవీఎల్ రాజు 'స్వాధ్య ప్రతిభ విజయనగరం మహరాజ' పుస్తకాన్ని అతనికి అందించారు. కళాశాల ప్రధానాచార్యుడు ఎం. సాంబశివరావు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రధానాచార్యుడు డా.బి.ఎస్.ఎన్.రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

1.2 కిలోల గంజాయి పట్టివేత

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి నుంచి 1.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన పూసపాటిరేగ మండలంలోని చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కందివలస గ్రామానికి చెందిన డి.భానుజీ(27) సమీపంలోని సంత వద్ద గంజాయి విక్రయిస్తున్నాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులకు నిందితుడు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం గ్రామీణం: వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో చంద్రరావు అన్నారు. విజయనగరం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

డిసెంబరుకు సమస్యల పరిష్కారం

కొత్తవలస: భూముల రీ-సర్వేలో లోపాలు డిసెంబరు నాటికి పరిష్కారం కానున్నాయని తహసీల్దార్ బి.నీలకంఠరావు చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పూసపాటిరేగ: చింతపల్లి సముద్ర తీరంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేశారు.

అతిసార బాధితులను ఆదుకోవాలి

విజయనగరం అర్బన్: మృతుల కుటుంబాలతో పాటు అతిసారం బాధితులను ఆదుకోవాలని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తన ఛాంబర్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

పూసపాటిరేగ: వెల్దూరు పంచాయతీ కిలుగుపేటలో శ్మశానవాటిక భూమిని కొంత మంది వ్యక్తులు ఆక్రమించి కంచె వేశారని మండల జనసేన నాయకులు జి.జమరాజు, సత్తిరెడ్డి తహసీల్దారు గోవిందకు ఫిర్యాదు చేశారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే

వేపాడ: గడివలసలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి రమాదేవి ఆధ్వర్యంలో కాలానుగుణ జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. జ్వర లక్షణాలున్న ముగ్గురికి మందులు సరఫరా చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

క్షేత్ర సహాయకులను రెన్యువల్ చేయాలి

శృంగవరపుకోట: దారపర్తి, నరేగా క్షేత్ర సహాయకుల పోస్టులను రెన్యువల్ చేయాలని జిల్లా అధికారులకు వినతులు ఇచ్చామని జనసేన నాయకుడు వి.సత్యనారాయణ తెలిపారు.

కాలువలు శుభ్రత తప్పనిసరి

కొత్తవలస: దోమలు లార్వా దశలోనే అంతం చేయాలని ఎంపీడీవో ఎస్.రమణయ్య అన్నారు. రామలింగపురంలో వైద్యాధికారి గోపాలకృష్ణతో కలిసి కాలువలు పరిశీలించారు. కాలువలు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు.

ఓటరు నమోదుపై అవగాహన

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ, శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓటరు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారు ప్రోస్పెక్టివ్ ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని ఈఆర్వో మురళీకృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ సునీత, ప్రిన్సిపల్ భాస్కరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: విద్యార్థులపై శారీరక, మానసికంగా తీవ్ర ప్రభావం చూపే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై భాస్కరరావు పేర్కొన్నారు. మంగళవారం చైతన్య కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా చట్టరీత్యా నేరమన్నారు.



సూచనలు చేస్తున్న ఎస్సై భాస్కరరావు

అమ్మవారి పండగ.. కనుల విందుగా

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ఉడాకాలనీ ఫేజ్-3లో కొలువుదీరిన పాత దుప్పాడ గ్రామ దేవతలు రాజగిరిమాత, బంగారమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పైడితల్లి అమ్మవారి పండగ జరిగిన మరుసటి మంగళవారం ఈ అమ్మవార్ల జాతర చేయడం ఆనవాయితీగా వస్తోంది. విచిత్ర వేషధారణలు, మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు దూళిపాళ్ల వెంకటరాంబాబుశర్మ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ డి.వి. రమణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.





పక్షం రోజులకోసారి రక్షిత పథకాల శుభ్రత

విజయనగరం పట్టణం: తాగునీటి పంపిణీలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కమిషనరు పి.నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు నీటి ట్యాంకులను పరిశీలించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంకులు శుభ్రపరిచే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు.

పైడితల్లికి ప్రత్యేక పూజలు



ఉత్సవ విగ్రహానికి పూజలు



అలంకరణలో చదురుగుడి అమ్మవారు



ఇలవేల్పు పల్లకి సేవలో పాల్గొన్న పైడితల్లి సేవకులు, దీక్షాధారులు

పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం సందర్భంగా మంగళవారం విజయనగరంలోని వనంగుడి, చదురుగుడిలో ప్రత్యేక పూజలు జరిగాయి. ముందుగా వనంగుడిలో వేదసభ నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా దర్శనాలకు భక్తులు బారులుదీరారు. తెప్పోత్సవాన్ని చూసేందుకు ఉత్తరాంధ్ర వాసులు తరలివచ్చారు. దీంతో పెద్దచెరువు పరిసరాలు కిక్కిరిశాయి.

– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్



వనంగుడిలో వేదసభ నిర్వహిస్తున్న రుత్వికులు

శృంగవరపుకోట ఆక్రమణల తొలగింపు



పర్యవేక్షిస్తున్న తహసీల్దార్, ఈవోపీఆర్డీ, ఈవో

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని విశాఖ-అరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఆక్రమణలను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. అక్రమంగా దుకాణాలు నెలకొల్పడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి జలమయమైంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలగడంతో పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం తహసీల్దారు అరుణకుమారి, ఈవోపీఆర్డీ ఐవీ.లక్ష్మీ, పంచాయతీ ఈవో అనురాధ రోడ్డు పక్కన వినియోగంలో లేని దుకాణాలు తొలగించారు. రెండు, మూడు రోజుల తర్వాత పూర్తిస్థాయిలో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

వరిపైరులో తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: వరి పైరులో దోమపోటు తెగుళ్లపై రైతులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని జిల్లా వనరుల వ్యవసాయాధికారిణి టి.సంగీత, ఏవో ఎం.పూర్ణిమ సూచించారు. మంగళవారం నెల్లిమర్ల, సారిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. వరిలో ఆకుముడత, దోమపోటు తెగుళ్ల నివారణకు మోతాదులో రసాయన మందులను పిచికారీ చేయాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ఏఈవో నాగరాజు, వీఏఏలు వేణు, శ్యామ్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంగీత